

# రాగహీన

శర్వాణి

భర్తకోసం నిరీక్షిస్తూ తలుపుదగ్గర నిల్చున్న సావిత్రమ్మ చీకటి పడుతూండటం చూసి లోపలికి వెళ్ళింది. లైటు వేసి అలవాటుచొప్పున చేతులూ కాళ్లూ కడుక్కుని దేవుడిముందు దీపం వెలిగించింది. ఆ వెలుగులో మెరుస్తున్న కృష్ణ విగ్రహాన్ని చూసి ఆమె పెదవులమీద చిరునవ్వు నిలిచింది 'ఎన్నో ఏళ్ళగా ఈ ఇంట్లోని సంఘటనలకంతా సాక్షీభూతంగా నిలిచివున్నాడీ స్వామి.' అనుకుంటూ తులసికోట దగ్గరికి నడిచింది. వెలిగించిన ప్రమిదను తులసికోట గూట్లో ఉంచింది. అగరువత్తులను తులసిచెట్టు పక్కన గుచ్చి, మళ్ళీ వాకిట్లోకి వచ్చి భర్తకోసం ఎదురు చూస్తూ కూర్చుంది. భర్త ఉదయం అన్న మాటలు ఆమెకు పదేపదే జ్ఞాపకం రాసాగాయి.

"సావిత్రీ, రేపటికి మన పెళ్ళయి పాతికేళ్ళయింది కదూ?''

"......''

"నీకు గుర్తులేదూ? రేపు వైశాఖ బహుళపంచమి కదా! ఆవాళ మీ ఊరు వస్తూంటే త్రోవలో బస్సు చెడిపోయింది కూడా గుర్తే నాకు. అపుడే పాతికేళ్ళయింది...''

సావిత్రమ్మ దానికి బదులు పలకలేదు. గుర్తుంచుకోవటం కన్నా మర్చిపోతే బావుండుననే సంఘటనలే ఎక్కువగా ఉన్నాయేమో జీవితంలో. అయినా భర్త మొదటిసారిగా అలా తమ పెళ్ళిగురించి తల్చుకుంటూంటే అతని సంతోషాన్ని పాడుచేయదల్చుకోలేదామె.

"రేపు ఏం చేద్దామంటావ్? వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చన చేయిద్దాం. ఏదయినా నీ కిష్టమయిన తీపి వండుతావా మరి? కాని మనిద్దరమే అయిపోయాము! అబ్బాయి చాలా దూరంలో ఉన్నాడాయె! పోనీ కమలను తీసుకురానాఏమిటి?''

సావిత్రమ్మ చిన్నగా నవ్వింది.

"అంత హడావిడిగా రమ్మంటే ఎందుకని అడగదూ?''

"చెబితే పోలా?'' అంటూ ఇరవైమైళ్ళ దూరంలో వున్న కమల అత్తవారింటికి బయలుదేరిపోయారు శేషాద్రిగారు. అప్పటినుండీ కాలుకాలిన పిల్లిలా ఇంట్లో తిరుగుతోంది సావిత్రమ్మ. గత పాతికేళ్ళ జీవితంలోని జ్ఞాపకాలు ఆమెను చుట్టుముట్టి కట్టివేస్తున్నాయి.

* * *

పెళ్లయినపుడు సావిత్రి వయసు కేవలం పధ్నాలుగేళ్లు. రెండో పెళ్ళయినా ఇంకా చిన్నవాడనీ, అందమూ, ఉద్యోగమూ ఉన్నవాడనీ, మంచి సంప్రదాయమయిన కుటుంబమనీ సావిత్రిని శేషాద్రి కిచ్చి పెళ్లి చేశారు. పెళ్ళిలో మొదటిసారిగా

భర్త మొహం చూసి 'ఎంత అందగాడు' అని మురిసిపోయింది సావిత్రి పసిమనసు. పదిహేనోఏట – అత్తవారింట్లో అడుగు పెట్టాక కాని ఆమెకు తన పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు.

అత్తగారు ఆమెను తల్లిలా చూసుకునేది. మామగారు ఎక్కువగా మాట్లాడకపోయినా వాత్సల్యంగా 'అమ్మాయ్' అంటూ పిలిస్తే తండ్రే గుర్తుకు వచ్చేవాడు సావిత్రికి.

ఎటుతిరిగీ ఆ ఇంట్లో ఆమెకు లభించనిది భర్త ప్రేమ మాత్రమే! తమ ఊళ్లో తన తోటిపిల్లలు అత్తారింటికి వెళ్లి వచ్చాక చెప్పే కబుర్లు ఎన్నో ఆమె విన్నది. తన పరిస్థితి దానికి వ్యతిరేకంగా ఉందనిమాత్రమే అర్థమయిం దామెకు.

రోజూ మగవాళ్ళిద్దరూ భోజనాలు చేసి ఆఫీసులకు వెళ్ళిపోయాక, ఆమె అత్తగారు, స్నానంచేసి మడి కట్టుకుని దేవుడి పూజకు ఉపక్రమించేది. కనీసం ఓ గంటయినా పూజ చేసేది. మందాసనం చుట్టూ చిత్రవిచిత్రంగా రంగవల్లిని తీర్చిదిద్దేది. దేవుడి సంపుటాలను తళతళా మెరిసేలా కడిగిన కృష్ణవిగ్రహాన్ని వాటి స్థానాల్లో అమర్చి శ్రద్ధగా పూజ చేసేది. ఆ సమయంలో సావిత్రినికూడా తన పక్కనే కూర్చోపెట్టుకునేది ఆ దీపాల కాంతిలో, మెరుస్తున్న మందారపుష్పాల మధ్య చిరునవ్వులు చిందించే కృష్ణుణ్ని చూస్తూంటే సావిత్రికి మైకంలాంటి దేదో కమ్మినట్టయ్యేది.

"అమ్మాయ్! ఇది తరతరాలుగా మనకు వచ్చిన సంపద. కష్టంలోనూ, సుఖంలోనూ కూడా దీన్ని మాత్రం మైలపడనీకు," అని అపుడపుడూ అంటున్న అత్తగారి మాటలు సావిత్రికి అర్థమయ్యేవి కావు.

ఒకరోజు అత్తగారు సావిత్రిని రహస్యంగా పిల్చి, "వాడు నిన్ను సరిగ్గా చూట్టంలేదుకదూ?" అనడిగింది. సావిత్రి ఓ క్షణం తెల్లబోయి, వెంటనే తేరుకుని తల వంచుకుంది ఆమె కళ్ళు తుడుచుకుని సావిత్రి తల నిమురుతూ ఉండిపోయింది. మరేం మాట్లాడలేదు.

సావిత్రి భర్తకు స్నానానికి నీళ్ళు తోడటం, ధోవతి అందించటం, భోజనం వడ్డించడం లాంటి పనులే చేస్తూండేది. అతనూ అంతవరకే ఆమెతో మాట్లాడేవాడు. సాయంత్రం ఇంటికి రాగానే స్నానం చేసి, కాసేపు పేపరు చేతబట్టుకుని కూచునేవాడు పెందరాళే భోజనం చేసి బయటికి వెళ్ళేవాడు. పొద్దుపోయి ఇంటికొచ్చేసరికి సావిత్రి మేలుకుని బిక్కుబిక్కుమంటూ కూర్చునిఉండేది.

"అలాకూర్చోకపోతే. నిద్రపోరాదూ" అని విసుక్కునేవాడు. భర్త పడుకున్నాక తలుపు గడియపెట్టి కింద చాప పర్చుకుని పడుకునేది సావిత్రి.

ఓ రోజు అత్తామామలు మాట్లాడుకుంటున్న మాటలు సావిత్రి చెవినపడ్డాయి. "మరి అంత బరి తెగించా డేమిటండీ?" అంటోంది అత్తగారు సహం ఏడుస్తూనే. "నే చెబితే విన్నావూ? మరోపిల్ల గొంతు కోశాం ఆ పిల్ల నిండు జీవితం ఏం కావాలిపుడు!" అన్నా రాయన గద్దిస్తూ. ఆమె ఏదో బ్రతిమాలుతోంది. "ఊహుఁ, నే నా పాపిష్టివాడి మొహం చూడను," అంటూ బయిటికి నడిచా రాయన.

ఇంకో రోజు "నన్నలాంటి అంతుల్లో పెట్టకమ్మా! పెళ్ళి చేసుకోమన్నావ్, చేసుకున్నా, నంతే," అని ధుమధుమలాడ్తూ, భర్త బయిటికి వెళ్ళటం గమనించింది సావిత్రి. కాని ఎవర్నీ ఏమీ అడగలేని సావిత్రి అన్నిటికీ మనసులోనే ఓ రూపకల్పన చేసుకుని నిట్టూర్చింది

అత్తవారింటికి ఆమె వచ్చిన ఆర్నెల్లకు గాబోలు, ఓ సాయంత్రం భర్త ఓ అమ్మాయిని వెంటబెట్టుకొచ్చాడు. ఆమెను ముందుగదిలో కూర్చొబెట్టి —

"అమ్మా! వాసంతి వచ్చింది. కాఫీ, టిఫిన్లు పంపించు సావిత్రిచేత," అని కేకేశాడు.

అత్తగారు ధుమధుమలాడుతూ 'ఇంటికే తీసుకొచ్చాడు, దాని మొహం మండా! ఎంత తెగింపూ, ఎంత తెగింపూ?' అని గొణుక్కుంటూ కాఫీ ఫలహారం సర్ది, అక్కడికొచ్చిన సావిత్రిని 'ను వక్కడికెళ్ళకు, గదిలోనే ఉండు' అనేసి పనిపిల్లాడితో పంపింది కాఫీని. కాసేపటికి శేషాద్రి లోపలి కొచ్చి 'సావిత్రిని పంపమనలేమూ? ఆమెను చూద్దామనే వాసంతి వచ్చింది' అంటూ 'సావిత్రీ, సావిత్రీ!' అని పిలిచాడు. ఇక ఆమె చేసేదిలేక ఊరుకోవాల్సి వచ్చింది. అక్కడికీ గొణుగుతూనే ఉంది. సావిత్రికి వెళ్ళక తప్పలేదు.

సావిత్రి లోపలికి వెళ్ళగానే 'రండి, కూర్చోండి,' అంది వాసంతి. సావిత్రి ఓ కుర్చీలో కూలబడింది. వాసంతి ఏమడిగిందో, త నేమని జవాబు చెప్పిందో సావిత్రికి ఒక్కటీ గుర్తులేదు. వాసంతి మాట్లాడుతూంటే చల్లని పిల్లగాలులు వీస్తున్నట్టూ, మధురగానం వింటున్నట్టూ తన్మయురాలయిపోయింది సావిత్రి. సన్నని తెల్ల వాయల్ చీరలో అతి సాదాగా ఉంది వాసంతి. ఆమె కళ్ళలో దయా, జాలీ, ప్రేమా తొణికిసలాడుతున్నాయి. స్నేహితులే లేని సావిత్రికి ప్రాణం లేచివచ్చినట్టయింది తన నక్కడ కూర్చోబెట్టి భర్త వెళ్ళిపోవటాన్నికూడా గమనించలే దామె. చిన్నపిల్లలా కిలకిలా నవ్వుతూ వాసంతితో కబుర్లు చెప్పింది. ఆమె వెళ్ళిపోతూంటే, మళ్ళీ అప్పుడప్పుడూ వస్తూంటానని మాట ఇస్తేగాని కదలనివ్వలేదు. కాని లోపలి కొచ్చేసరికి అత్తగార్ని చూసి తెల్లబోయింది ఆమె దేవుడి విగ్రహంముందు సాగిలబడి రోదిస్తోంది. "అత్తయ్యా!" అంది బెరుగ్గా. ఆమె అంతకుముందు అనుభవించిన ఆనందమంతా మాదిపింజెలా ఎగిరిపోయింది. ఆమె లేచి కూర్చుని కళ్లు తుడుచు

కుంది. వీలయినంత శాంతంగా 'వెళ్ళి స్నానం చేసిరా అమ్మా! ఆ మోహిని వాడినే కాదు, నన్నూ లోబర్చుకోగలదు. మాయమంత్రాలేమి నేర్చుకుందో గాని..." అంది

ఆవేళ రాత్రి ఆమె కొడుకుతో పెద్దగా గర్షణపడ్డారు. 'నా కంఠంలో ప్రాణం ఉండగా ఆమె ఈ ఇంటి ఛాయలకు రావటానికి వీల్లే'దని ఆమె గట్టిగా చెప్పటం ఇంట్లో అందరికీ వినిపించింది. శేషాద్రి మొహం మాడ్చుకుని ముసుగు తన్ని పడుకున్నాడు.

సావిత్రి అన్నీ చూస్తూ ఊరుకుంది.

వ[illegible]హారం రోజులకు సావిత్రి జీవితంలో గుర్తుంచుకోదగిన మరొకసంఘటన జరిగింది

ఆవేళ భర్త ఆమెను దగ్గరకు పిలిచాడు. పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. మంచి మాటలతో లాలిస్తూ దగ్గరకు తీసుకున్నాడు. సావిత్రి మొదట తెల్లబోయింది. ఆ తరువాత అభిమానపడింది. ఇన్ని రోజుల అనాదరణని చేదుమాత్రలా మింగిన ఆమె, అకస్మాత్తుగా లభ్యమయిన ఈ ఆదరణకు తట్టుకోలేక ఎక్కెక్కి పడవసాగింది. శేషాద్రి ఆమెను ఓదార్చాడు. "వాసంతి అంటే నా కిష్టం. నీకు కోపమా?" అన్నాడు. ఒక్క నిమిషం వాసంతి రూపం సావిత్రి కళ్ళముందు మెదిలింది. హాయిగా అనిపించింది. 'వాసంతిని ఇష్టపడనివారెవరు?' అనుకుంటూ కళ్లు మూసుకుంది. పదహారో ఏట అడుగుపెడుతున్న ఆ అమాయికపు పల్లెటూరిపిల్లకు ఆ సంగతి అంతకన్నా లోతుగా ఆలోచించాల్సిన విషయమని తోచలేదప్పుడు.



మరుసటిరోజు నవుకరు కుర్రాడు చేతులూపుకుంటూ అత్తగారితో ఏదో చెబుతున్నాడు. ఆమె నవ్వుతున్నది! దగ్గరగా వచ్చిన సావిత్రిని 'రామ్మా రా, నీ పాలిటి శని వదలిపోయింది. ఆ మారెమ్మ మొగుడికి ఈ ఊరినుండి బదిలీ అయిందట. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయి వారమయిందట. కృష్ణపరమాత్ముడు ఇన్నేళ్ళకి నా మొర విన్నాడే తల్లీ!' అంది సంతోషంతో ఉప్పొంగిపోతూ.

కాని ఆ సంతోషం ఎన్నో రోజుల

నిలవలేదు. ఓ నెలరోజులు శేషాద్రి ఇంటిని తన నవ్వులతో కళకళలాడించాడు. ఆ నెలరోజుల ప్రయత్నంతోనే తన పలుకుబడినంతా వినియోగించి శివస్వామిని మళ్ళీ ఊరికి రప్పించుకున్నాడు.

ఇల్లు మళ్ళీ మొదటికొచ్చింది – కొద్ది మార్పులతో. మొదట అయితే సావిత్రిని పట్టించుకునేవాడు కాదు, కాని ఇప్పుడలా కాదు. చీటికిమాటికీ కసురుకునేవాడు. 'ఈ వస్తువు, ఇక్కడేనా పెట్టాల్సింది? ఏదయినా తెలిసిపడిస్తేగా!'

'ఛీ! దేభ్యం మొహమూ నువ్వూను! ఛీ! ఛీ!'

ఇలా ఎంతమాటబడితే అంతమాట అనేసేవాడు. ఆ మాటలకన్నా, ఆ మాటల్లోని కాఠిన్యానికి అదిరిపోయేది. ఏడుస్తూ రోజులు గడపటం అలవాటయింది సావిత్రికి.

కుంటుతూ నడుస్తున్న బండికి హఠాత్తుగా ఎదురుదెబ్బ తగిలినట్టు సావిత్రి మామగారు హఠాత్తుగా గుండె ఆగి మరణించారు. సావిత్రికే అదో పెద్ద దెబ్బ అనుకుంటే ఇక ఆమె అత్తగారి సంగతేం చెప్పాలి?

సావిత్రి లేనినిబ్బరం తెచ్చుకుని అత్తగారికి సేవ చెయ్యసాగింది. ఇంట్లో ఏ లోటూ రానివ్వకుండా ఎంతో చాకచక్యంగా పనులు చేసుకుపోతోంది. తండ్రి మరణం శేషాద్రిని ఎక్కువగా క్రుంగదీయలేదు. ఇంటి యాజమాన్యం చేతికి అందటంతో, దాన్ని కొత్తరకంగా చలాయించసాగాడు. అన్నిటికీ గురైనది సావిత్రి. భర్తను సంతోషపెట్టాలని, అతను కసురుకోకుండా చూడాలనీ శతవిధాలుగా ప్రయత్నించినా, రోజుకోసారైనా చీవాట్లు తప్పేవి కావామెకు.

మంచంలోంచి లేవలేక, సావిత్రికే సాయమూ చేయలేక సావిత్రి అత్తగారు లోలోన కుమిలిపోయేవారు. రోజురోజుకూ క్షీణించిపోతున్న అత్తగారిని చూసి చాటుగా ఏడ్చేది సావిత్రి. ఆఖరికో రోజున ఆమె సావిత్రిని దగ్గర కూర్చోబెట్టుకుని "అమ్మాయ్! ఇక నే నెన్నో రోజులు బ్రతుకను," అన్నారు. సావిత్రి ఏడ్చింది.

"ఏడువకు తల్లీ! గుండె రాయిచేసుకో. నీ కింత కష్టం తెచ్చిపెట్టింది నేనేనమ్మా, నేనే. కాకపోతే వాడొద్దన్నా ఈ పెళ్ళి చేయిస్తానా! దాని ఫలితం నువ్వనుభవించాల్సి వచ్చింది ... తల్లీ! నువ్వు నాకో మాట ఇవ్వాలి," అన్నారు. ఆమె కంఠం హఠాత్తుగా కఠినంగా మారిపోయింది.

"నువ్వెప్పటికీ ఆత్మహత్య చేసుకోకూడదు."

సావిత్రి అదిరిపడి అత్తగారి వేపు చూసింది. ఆమెకు పిచ్చిపట్టలేదుకదా అని అనిపించింది సావిత్రికి.

"నీకు తెలియదు. ఈ సంగతి ఇన్నేళ్ళుగా కడుపులో దాచుకున్నాను. లక్ష్మి, వీడి నిర్లక్ష్యాన్ని భరించలేక నూతిలో పడి చచ్చిపోయిందమ్మా. ఎంత అభిమానమో నా తల్లికి. ఓర్చుకోలేకపోయింది. నేను కన్నది బిడ్డను కాదమ్మా– కొరివిని. వాడు అందర్నీ కాల్చుకుతింటున్నాడు." ఆమె కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయి. ఆయాసంతో రొప్పుతూ కళ్ళు మూసుకున్నారామె. మూసిన కళ్ళవెంబడి నీళ్ళు జలజలా రాలుతున్నాయి.

సావిత్రి, నిశ్చేష్టురాలై వింటూ కూర్చున్నది– తేరుకుని తడబడుతూ 'కాసిని పాలు తేనా అత్తయ్యా' అంటూ పైకి లేచింది.

ఆమె సావిత్రి చేతిని గట్టిగా పట్టుకుని 'వద్దు' అని సైగచేశారు.

"నువ్వెప్పుడూ అలాంటిపని చెయ్యవు కదూ? ఈ వంశాన్ని నిలబెడతానని మాటివ్వు. నే నింకెన్ని రోజుల్లో బ్రతకను. నీ కడుపులో పెరుగుతున్న బాబును చూసే భాగ్యం నాకు లేదు. కాని ఏం జరిగినా ఎంత కష్టాన్నైనా సహించి ఈ వంశాన్ని నిలబెడతానని మాటివ్వు తల్లీ! ఈ ముసలిదాని స్వార్థాన్ని కాదనకు.''

సావిత్రి ఆమె చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది. ఇంతటి రహస్యాన్ని దిగమ్రింగి శాంతంగా ఊరుకోవటము ఆమెకు అసాధ్యమయింది. "నా కై నేనుగా చావును తెచ్చుకోను," అంది ఆఖరికి. ఆ మాటతో ఆ వృద్ధురాలి మొహంలో కనిపించిన ప్రశాంతతనీ, తృప్తినీ చూసి నిట్టూర్చింది సావిత్రి.

ఆర్నెల్ల వ్యవధిలో ఇంటి స్తంభాల్లాంటి పెద్దల నిద్దర్నీ పోగొట్టుకున్న ఆ ఇల్లు కళాకాంతులు కోల్పోయి బావురుమనసాగింది. ఆ సమయంలో చూసిపోవటానికి వచ్చిన సావిత్రి తల్లి, అల్లుడితో ''ఇద్దరూ వచ్చి కొద్ది రోజులు అక్కడ ఉండివద్దురుకాని రండి,'' అని బలవంతపెట్టింది. శేషాద్రి ససేమిరా ఒప్పుకోలేదు.

"పోనీ అమ్మాయినైనా పంపు బా ఎలాగూ అయిదోనెల వెళ్ళిపోతో" అన్నారామె. దానికీ శేషాద్రి ఒప్పుకో లేదు.

"ఏడోనెల్లో తీసికెడుదురుగాని," అని చప్పరించేశాడు.

మరో రెండు నెల్లు అంటే పురిటికి వెళ్ళేదాకా బిక్కుబిక్కుమంటూ గడపక తప్పలేదు సావిత్రికి.

సావిత్రి ఇంట్లో ఒంటరిగా ఉంటుందని తెలిసికూడా శేషాద్రి తన దినచర్య మార్చుకోలేదు. రాత్రి అతను వచ్చేదాకా ఒంటరిగా ఉండాలంటే సావిత్రికి భయం కూడా వేసేది. చుట్టూ ఇళ్ళల్లో దీపాలు ఆరిపోయేవి. వాడ అంతా నిద్రిస్తున్నట్టుగ నిశ్శబ్దంగా ఉండేది. కీచురాళ్ళ కీచుమన్న శబ్దం తప్ప మరొకటి వినబడేదికాదు. సావిత్రి తలుపులన్నీ గడియపెట్టుకుని కిటికీదగ్గరే కూర్చుని, భర్త వస్తున్న జాడ కనిపిస్తుందేమోనని ఎదురుచూస్తూండేది. అపుడు ఆమెకు తన బాల్యమంతా గుర్తు

వచ్చేది. పదిమంది ఉన్నచోట్లో కలివిడిగా తిరుగుతూ వంటరితనమే ఎరుగని సావిత్రి. వంటరిగా కూర్చుని ఆ రోజుల్ని తల్చుకుని నిట్టూర్చేది. దూరంగా తెల్లబట్టల్లో భర్త నడిచిరావటం కనిపించాక ఆమె మనసు కుదుటబడేది.

ఓరోజు శేషాద్రి మంచంమీద పడుకుంటూనే, కెవ్వుమని కేక వేసినంత పని చేశాడు. సావిత్రి అదిరిపడి అతనివేపు చూసింది.

"నా శాలువా ఏదీ?"

సావిత్రి తేరుకుని, మడత పెట్టి స్టాండు మీద పడేసిన శాలువా తెచ్చి అతని కందించింది.

శేషాద్రి శాలువా కప్పుకుని ప్రశాంతంగా పడుకుని నిద్రపోయాడు.

చుట్టూ రంగురంగుల పూలు కుట్టిన లేత నీలంరంగు శాలువా అది! ఆ రోజు మధ్యాహ్నం దుప్పట్లతోబాటు శాలువాను కూడా ఎండలో పడేసింది. మళ్ళీ దాని స్థానంలో పెట్టటం మర్చిపోయింది. కాని దానికోసం కొంప మునిగినట్టు అలా కేకెయ్యటం ఎందుకో ఆమెకు అర్థం కాలేదు. బహుశా భర్త స్వభావమే అంత అనుకుని ఊరుకుందామె.

రానురాను ఇరుగుపొరుగు అమ్మలక్కలమూలంగా ఆమెకు చాలా విషయాలు తెలిశాయి.

చిన్నప్పటినుండీ శేషాద్రీ, వాసంతీ కలిసి చదువుకున్నారు, కలిసి తిరిగారు. కులం వేరవటంతో వారు పెళ్ళి చేసుకోలేకపోయినా, తమ సంబంధాన్ని రహస్యంగా ఉంచుకోలేదు. వారి విషయం ఆ వాడలో అందరికీ తెలిసినదే. వాసంతి భర్త కూడా ఈ సంగతి తెలిసీ తెలియనట్టు, చూసీ చూడనట్టు ఊరుకుంటున్నాడంటే ఇక మరొకడి అడ్డేముంది వారికి? ఆ శాలువా అతనికి వాసంతి ఇచ్చిన ప్రేమ కానుక.

ఓసారి సావిత్రికి కొద్దిగా జ్వరం తగిలింది. అదే తగ్గుతుంది లెమ్మని ఊరుకుంది కాని, మధ్యాహ్నానికల్లా జ్వరం ఎక్కువయి లేవలేక మూలుగుతూ పడుకుంది. జ్వరం మగతలో ఆమె కేమీ తెలియటం లేదు. ఎంతోసేపటికి నుదుటిమీద తగిలిన చల్లని స్పర్శకు 'అమ్మా' అని కళ్లు తెరిచింది. సావిత్రి భర్త వచ్చాడేమో అనుకుంది; కాని ఆమెకు కనిపించింది వాసంతి ముఖం.

"బాగా జ్వరంగా ఉందే! మందు ఏమన్నా వేసుకున్నావా సావిత్రీ?" అంది.

సావిత్రి మాట్లాడలేక మళ్ళీ కళ్లు మూసుకుంది. మూసుకున్న ఆమె కళ్ళ నుండి వేడి కన్నీరు కారసాగింది.

తరువాత వాసంతి శేషుని గద్దించటం, నౌకరుకుర్రాణ్ణి కేకేసి కాఫీ తెమ్మనటం సావిత్రికి లీలగా వినిపించింది.

మరోగంటకు డాక్టరు వచ్చి చూసి వెళ్ళటమూ, వాసంతి శేషాద్రితో భార్యను శ్రద్ధగా చూచుకోమని చెప్పి వెళ్ళటమూ జరిగింది.

మరో రెండు రోజుల్లో సావిత్రికి జ్వరం తగ్గింది. ఆ తరువాత ఆమె పుట్టింటి వారు వచ్చి పురుటికి తీసికెళ్ళారు.

బాబుకు అయిదోనెల వచ్చాక సావిత్రి మళ్ళీ తన ఇంట్లోకి బాబునెత్తుకుని అడుగు పెట్టింది. ఈ ఆరేడు నెలల్లో సావిత్రి బాగా ఎదిగింది. లోకం పోకడ తెలుసుకోగలుగుతోంది. కాస్త గడుసతనం కూడా అబ్బింది. బాబును చూసయినా భర్త కాస్త మారుతాడేమోనని ఆశించింది సావిత్రి. శేషాద్రి బాబును ప్రేమగానే చూసేవాడు కాని భార్యపట్ల అతని ప్రవర్తనలో మార్పేమీ లేదు.


కాకపోతే ఇపుడా ఇంటికి వాసంతి తరచుగా వస్తోంది. సాయంత్రం శేషాద్రి రాకముందే వాసంతి వచ్చేస్తుంది. బాబునెత్తుకుంటుంది. బాబుకోసం రకరకాల గుడ్డలు కుట్టి తెచ్చేది. అవన్నీ బాబుకి తొడిగి చూసి ఆనందించేది.

"శేషూ! ఇలా చూడు; ఈ చొక్కాలో ఎంత బావున్నాడో నీ కొడుకు," అంటూ శేషాద్రికి చూపించేది.

"ఓ భేషుగ్గా ఉన్నాడు," అంటూ కొడుకు బుగ్గ గిల్లి "ఏరా, పిన్ని చూడు నీకెంత మంచిచొక్కా తెచ్చిందో" అనేవాడతను.

'అచ్చంగా పిన్నే అయి కూర్చుంది' అనుకునేది సావిత్రి.

వాసంతి బలవంతపెట్టి సావిత్రికి కుట్టూ అల్లికలూ నేర్పింది. ఇంటి అలంకరణ అంతా వాసంతి చేతులమీదుగా జరిగేది.



తెల్లనివన్నీ పాలు అనుకోలేని సావిత్రి వాసంతి పైపై మాటలూ, చేతలూ కాకుండా దాని వెనుకనున్న అంతర్యాన్ని గుర్తించసాగింది. ఆమె మాటల, చేతల వెనుక ఒకరకమయిన హుందాతనం, దర్పం, అధికారం చెలాయించాలన్న కోరిక కనిపించే వామెకు.

ఆమె అత్తగారున్నపుడు ఈ గొడవ లేవీ ఉండేవి కావు. ఇపుడీ సవతిపోరు రోజూ రంపపుకోతగా మారింది. కాస్త వాసంతి మాట పట్టించుకోనిరోజున —

“వాసంతి చెబితే కాదన్నావటగా! ఆమెకన్నా నీకెక్కువ తెలుసా? అంతా గర్వం!” ఇలాంటి మాటలు భర్తనుండి వినాల్సివచ్చేది. కత్తిమీద సాములా అయింది సావిత్రి పరిస్థితి. ‘వాసంతి ఇలా ఎందుకు తనను వెంటాడుతోందో! మొదటిలా దూరంగా ఉండిపోకూడదూ?’ అనుకునేది.

ఆరు గజాల సన్నటి చీరలు వచ్చాయి ఇంట్లోకి. మొదటిసారి లంగామీద చీర కట్టుకున్నపుడు సిగ్గుతో కుంచించుకుపోయింది సావిత్రి. వాసంతి, బాబుతో బాటు సావిత్రి దుస్తులమీద అసక్తి చూపటానికి మొదలెట్టినదాని ఫలితం అది.

“ఇంకా చిన్నపిల్లవు. రెండు జడ లేసుకుంటే నేం?” అంటూ సావిత్రికి రెండుజడలు వేసేది.

ఆ అలంకరణను శేషాద్రి మెచ్చుకునేవాడు. “నువ్వూ ఫర్వాలేదు, బాగానే ఉన్నావే!” అన్న శేషాద్రి మాటతో భూమిలోకి కుంచించుకుపోయేది సావిత్రి.

తన కాపురమేమిటో, తనేమిటోనన్న అయోమయంలో ఉండగానే సావిత్రికి కమల పుట్టింది.

ఆ ఇంటికి పట్టిన రాహువులా ఒక్క వాసంతి లేకపోతే ముచ్చటగా చెప్పుకో తగ్గ కాపురం అది. ముత్యాల్లాంటి పిల్లలు. సావిత్రి కేం తక్కువ? కాని ఎప్పుడూ చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని వాసంతికోసం పరుగులు తీసే భర్త — ఇంట్లో ఉన్నంతసేపూ చికాకుపడి, సావిత్రిని చికాకు పెట్టేవాడు.

పాప పుట్టాక కొద్దిరోజులు శేషాద్రి ఇంటిని అంటిపెట్టుకుని మసిలాడు. బాబుకన్నా పాప అతన్ని కట్టివేసింది. సావిత్రి ఎంతో కుతూహలంగా అతనిలోని మార్పుని గమనిస్తోంది. సాయంత్రం ఇంటికొచ్చి పాపను ముద్దాడ్తూ కూర్చున్న శేషాద్రిని తుఫానులా వచ్చి లేవగొట్టేది వాసంతి— ‘మంచి సినిమా వచ్చింది; ఇంకా ఇలా కూర్చున్నావేం,’ అంటూ. బీరువాలోంచి తన కిష్టమయిన జత తీసి ఇచ్చేది. అతను ఆ డ్రస్ వేసుకుని రాగానే అతన్ని చూసి ‘ఓహ్! బ్యూటిఫుల్—ఎలా ఉన్నావో చూసుకో! ఈ మధ్య మరీ మందకొడిగా తయారయ్యావు పో!” అనేది సగం మెచ్చుకోలుగా.

ఏదో విషయంలో వాసంతి సలహాను తిరస్కరించిన ఫలితంగా దెబ్బలు తినాల్సి వచ్చింది— “వాసంతి మాటంటే నీకంత చులకన అయిందా? ఆమె లేకపోతే నువ్వేమయ్యేదానివో ఈ పాటికి! నీకూ నీ పిల్లలకూ ఇంత చేస్తున్నదన్న జ్ఞానమయినా లేదేం? కాస్త వళ్లు దగ్గర పెట్టుకుని మసులుకో,” అని శాసించాడు శేషాద్రి భార్యను.

సావిత్రి కంట్లోని నీరు కంట్లోనే ఇగిరిపోయింది. ఇక తనకు మంచిరోజులు లేవనీ, తన గతి ఇంతేననీ తీర్మానించుకుంది సావిత్రి.

వాసంతి మనస్తత్వం లీలగా అర్థమవసాగింది సావిత్రికి. ‘తననూ పిల్లల్నీ వాసంతి అభిమానంగా చూడటం నిజమే. కాని అదే—భర్త తనను అభిమానంగా చూస్తేమటుకు ఆమె భరించలేదు. సరే, ఏది ఎలా జరగాలో అలా జరగనీ’ అని ఓ రకం నిస్పృహతో, పిల్లల్ని చూసుకుంటూ, ఇల్లు దిద్దుకుంటూ కాలం గడపసాగింది సావిత్రి.

అత్తగార్ని తల్చుకున్నప్పుడల్లా “ఈ పిల్లలే లేకపోతే ఆమె కిచ్చిన మాట నిలబెట్టేదాన్నే కాదు,” అనుకుంటూ నిట్టూర్చేది.

అలా నరకయాతన అనుభవిస్తూనే ఒకటి కాదు, రెండు కాదు, పదిహేనేళ్లు గడిపింది సావిత్రమ్మ.

ఆ తరువాత వాసంతి జబ్బు చేసి తీసుకుని చనిపోయింది. ఆఖరిరోజుల్లో తన ఇంట్లోనే ఆమెను తెచ్చిపెట్టుకుని మనఃపూర్వకంగా సేవ చేసింది సావిత్రి. ఇప్పుడామెకు అసూయగాని, కోపంగాని ఏమీ లేవు. జాలి మాత్రమే మిగిలింది ఆ స్థానంలో. దయనీయమైన పరిస్థితిలో వున్న వాసంతిని మరింత దయగా చూసుకుంది సావిత్రి.

“సావిత్రీ! నిన్నెంతో కష్టపెట్టాను. ఉందామన్నా మరోవిధంగా ఉండలేకపోయాను. శేషూ నేనూ విడివిడిగా పెళ్లి చేసుకున్నా, భార్యాభర్తలుగా నే బ్రతికాం. మమ్మల్ని చావుతప్ప మరేదీ విడదీయలేకపోయింది,” అని చెప్పుకుంది వాసంతి.

వాసంతి మరణంతో భర్త మళ్ళీ మనిషవుతాడా అన్న భయం పట్టుకుంది సావిత్రికి. కాని శేషాద్రి ఓ నెలరోజులు మాత్రమే దిగులుగా ఉన్నాడు. ఆ తరువాత చిత్రంగా మారిపోయిన అతన్ని చూసి ఏమనుకోవాలో అర్థంకాలేదు సావిత్రికి. ఇంతకుమునుపు ఏమీ జరగనట్టుగా, వాసంతి అన్న మనిషే భూమిమీద ఉండనేలే దన్నట్టుగా మారిపోయాడు.

ఆశ్చర్యకరంగా— ఇంట్లో పెళ్ళాం పిల్లలే లోకంగా బ్రతకసాగాడు. వాసంతి మరణంతో వచ్చిన మార్పు ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా కొట్టుకుపోతుందో నన్న సావిత్రి సందేహం నిజం కాలేదు.

ఆ తరువాత పదేళ్ళూ ఎంతో హాయిగా గడిచిపోయాయి. పిల్లలంటే ప్రాణం శేషాద్రికి. బాబు విశాఖపట్నంలో చదువుకుంటున్నాడు. కమల పెళ్ళయి అత్తారింటికి వెళ్ళింది.

మళ్ళీ ఆ ఇంట్లో ఇద్దరే మిగిలారు. కాని ఇపుడు శేషాద్రి వీలయినంతవరకూ సావిత్రిని ఒంటరిగా ఉండనీయటంలేదు.

"ఒక్కతివీ ఏం తోస్తుంది? అలా వెళ్ళొద్దాం రా," అని తీసుకు వెళ్ళేవాడు.

"ఇదిగో, కమలని చూడాలనుంటే చెప్పు. మనసులో దాచుకోకు; వెళ్ళి తీసుకొస్తాను. లేదా మనమే వెళ్ళి చూసొద్దా" మనేవాడు.

జీవిత ప్రథమాంకంలో భరించరాని బాధలకు లోనైనా, ఈ చివరిదశలోనైనా తన కాపురం ఒడిదుడుకులు లేకుండా సుఖశాంతులతో గడిచిపోతున్నందు కామె ఎంతగానో సంతృప్తి చెందుతున్నది. కాని ఇవాళ భర్త "మన పెళ్ళి," అన్నప్పటినుండీ ఆమెను గతం వదలకుండా కళ్ళముందు మెదిలి, యాతన పెట్టింది.

"అమ్మా" అన్న కేకతో ఈ లోకంలోకి వచ్చిపడింది సావిత్రమ్మ.

"ఇదిగోనే అమ్మా! నాన్నగారు ఏమేం తెచ్చారో చూడు," అంటూ ప్యాకెట్లు మోసుకుని ఇంట్లోకి అడుగుపెడుతోంది కమల. ఆమె వెనుకనే నవ్వుతూ నించున్నారు శేషాద్రిగారు.

సావిత్రమ్మ చెమర్చిన కళ్ళను వాళ్ళకు కనిపించనీయకుండా తుడుచుకుంటూ లేచి ఎదురువెళ్ళింది. ★

